

ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎంఎల్‌సిలు ఎంఎల్‌ఏలు, జెసి పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ బి.పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్యాగనిరతికి ప్రతీక ఈద్– ఉల్– అజా (బక్రీద్) అని, ముస్లింలు జరుపుకునే అతి ముఖ్యమైన పండుగలలో ఒకటి బక్రీద్ అన్నారు. ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను ముస్లిం సోదర సోదరీ మణులందరూ సంతోషంగా మతసామరస్యంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు.

క్రీడా మైదానాలెవీ..?

- శారీరక దృఢత్వం.. మానసిక ఉల్లాసం కరువు
- భలే.. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు దూరంగా విద్యార్థులు



పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్న క్రీడా మైదానం

ప్రజాశక్తి- పూతలపట్టు: అన్ని రంగాల్లో గ్రామీణ విద్యార్థులు ప్రతిభ చాటాలని.. గ్రామీణస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల్లో రాణించాలని గొప్పలు చెప్పుకుంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఇందుకు అవసరమైన వసతులు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం చొరవ చూపించడం లేదు. సరైన క్రీడా మైదానాలు.. ఆడుకోవడానికి సరైన క్రీడా పరికరాలు లేక విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కావాల్సి వస్తోంది. క్రీడలపై మక్కువ ఉన్న విద్యార్థులు ఉన్న అరకొర వసతులతో రాణించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. క్రీడల వలన విద్యార్థుల్లో మానసికల్లాసం, శారీరక దఢత్వం ఏర్పడుతుందన్న ఉద్దేశంతో చాలామంది విద్యార్థులు క్రీడలపై ఇష్టమున్నా తగిన వసతులు లేకపోవడంతో తమ ఆశయాన్ని నీరు కాల్చుకోవాల్సి వస్తోంది.

గురువులు ఉన్నా లేనట్టే..

కొన్ని పాఠశాలల్లో క్రీడా మైదానాలు, తగిన పరికరాలు లేకపోవడంతో ఆయా పాఠశాలల్లో క్రీడా గురువులు ఉన్న లేనట్టుగానే ఉంది. ఉదయం ప్రార్థన మందిరంలో విద్యార్థులను వరుస క్రమంలో నిలబెట్టడం.. పాఠశాలల్లో ఇతర పనులకు మాత్రమే క్రీడాగురువులు పరిమితమవుతున్నారు. విద్యాశాఖ ప్రమాణాల ప్రకారం ప్రతి ఉన్నత పాఠశాలకు కనీసం ఐదు ఎకరాల విస్తీర్ణం కలిగినాటస్థలం ఉండాలి. కానీ ఎక్కడ ఈ పరిస్థితి కనిపించడం లేదు. కొన్నిచోట్ల పాఠశాలకు సరైన ఆర్థిక వనరులు లేకపోవడంతో ఉపాధ్యాయులు దాతలు సహాయంతో క్రీడా పరికరాలను అరకొరాగా సమకూర్చుకుంటున్నారు.

> గ్రామీణ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని.. ప్రతి విద్యార్థి శారీరక దఢత్వం కలిగి ఉండాలని నాయకులు సమావేశాల్లో పదేపదే చెబుతుంటారు.. కానీ ఇందుకు అవసరమైన క్రీడా మైదానాలు.. పరికరాలు సమకూర్చడంలో ఎలాంటి చొరవ చూపించారన్న విమర్శలు నిత్యం వినిపిస్తుంటాయి. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల పరిస్థితి మారింది.

మండలంలో పరిస్థితి...

పూతలపట్టు మండలంలో మొత్తం 72 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నాయి. ఇందులో తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 11 ప్రాథమికోన్నత, 52 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఉన్నత పాఠశాలల్లో కూడా క్రీడా మైదానాలు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ఉన్న అరకొర మైదానాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునే నాధుడే లేడు. మరికొన్ని క్రీడా మైదానాలు అయితే పిచ్చి మొక్కలతో నిండుకొని విద్యార్థులకు ఉపయోగకరంగా లేవు. ఇకనైనా అధికారులు తగిన చొరవతీసుకొని విద్యార్థులకు అవసరమైన క్రీడా మైదానాలు, పరికరాలు సమకూర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

- మృతుని కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కుప్పం డిఎస్పి శ్రీనాథ్, అటవీ శాఖ రేంజర్ జయశంకర్



ఏనుగు దాడిలో మరణించిన కన్నా నాయక్

ప్రజాశక్తి - రామకుప్పం : మండల పరిధిలోని పంద్యాల మడుగు పంచాయతీ, పులిమడుగు తాండ గ్రామశివార్లలో ఒంటరి ఏనుగు దాడిలో వ్యక్తి మతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, అధికారుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి పులిమడుగు తాండ గ్రామానికి చెందిన కన్నా నాయక్ (70) గ్రామం నుంచి కొత్తూరు తండాకు వెళ్లే దారిలో ఉన్న పశువుల షెడ్డు వద్దకు వెళ్లాడు.. అక్కడి నుంచి ప్రధానరోడ్డు మార్గంలో తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఒంటరి ఏనుగు అతనిపై దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. సౌందర్య నాయక్‌కు చెందిన టమోటా తోటలో మేతకు సంచరిస్తున్న ఒంటరి ఏనుగు ఆగ్రహంతో ఒక్కసారిగా కన్నా నాయక్ మీదకు వచ్చి కింకారాలతో అతనిపై దాడి చేసి పొర్లించి తొండంతో అతన్ని విసిరింది. ఏనుగు కీంకారాలు విన్న మృతుని బంధువులు, స్థానికులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని చూడగా అప్పటికే కన్నా నాయక్ మతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఇతను వ్యవసాయ కూలిగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. షెడ్డు వద్ద పశువులను చూసి రావడానికి వెళ్లి ఏనుగు దాడిలో మరణించాడు. దాడికి ముందు కష్ణా నాయక్‌కు చెందిన అరటితోటలో ఒంటరి ఏనుగు తిన్నంత తిని, తొక్కి ధ్వంసం చేసింది. ఆదివారం ఉదయం కుప్పం డిఎస్పి శ్రీనాథ్, అటవీ శాఖ రేంజర్ జయశంకర్ ఇతర అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ఒంటరి ఏనుగు దాడిపై ఆరా తీసి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. మతదేహాన్ని కుప్పం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మతుని కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, జిల్లా డిఎఫ్ఓ చైతన్య కుమార్ రెడ్డి ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల చెక్కును వారి కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం అటవీ సరిహద్దుల్లో పంట పొలాలపై ఏనుగుల దాడులు అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలనీ ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో సీఐ ఈశ్వర్ రెడ్డి, ఎస్ఐ శివకుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మృతుడు కన్నా నాయక్ (ఫైల్ ఫోటో)





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కుప్పం డిఎస్పి శ్రీనాథ్, అటవీ శాఖ రేంజర్ జయశంకర్, ఆర్థిక సాయం అందిస్తున్న అధికారులు, నేతలు

అన్ని సౌకర్యాలతో ప్రభుత్వబడులు

- దేవరాజులు, జిల్లా విద్యాశాఖాధికారి

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రస్తుతం జిల్లాలోని దాదాపు అన్ని ప్రభుత్వబడుల్లో మరుగుదొడ్లు, వంటగది, చక్కటి తరగతి గదులు, తాగునీటి సౌకర్యం కల్పించబడింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన తరగతి గదుల్లో విద్యాభోదన జరుగుతోంది. క్వాలిఫైడ్ ఉపాధ్యాయుల ద్వారా ఉచితంగా విద్యను అందించడం జరుగుతోంది. విద్యారంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా ప్రభుత్వబడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య భాగా పెరిగిందనే చెప్పాలి. ఈ విద్యా సంవత్సరం కూడా నూతనంగా ప్రభుత్వబడుల్లో చేర్చేందకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వబడుల్లో తమ పిల్లన్ని చేర్చాలంటూ ఉపాధ్యాయులు తమ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పింస్తున్నారు. ఫలితంగా ఈవిద్యా సంవత్సరంలో ప్రభుత్వబడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆశిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు ప్రజాశక్తి దినపత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రజాశక్తి: జిల్లాలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలున్నాయి?

జిల్లా విద్యాశాఖాధికారి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,803 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. నాడు– నేడు క్రింద నిరంత నీటి సరఫరా, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, శుద్ధి తాగునీరు, ఫర్నీచర్, రంగులు వేయడం, మరమ్మతులు, గ్రీన్ గ్లోస్సీ చాక్ బోర్డు, ఇంగ్లీష్ ల్యాబ్, ప్రహరీగోడల నిర్మాణం, వంట గదులు నిర్మాణం, తరగతి గదుల నిర్మాణం చేపట్టడం జరిగింది.

ప్రజాశక్తి: చిత్తూరు జిల్లాలో అమ్మఒడి లబ్దిదార్లు ఎంత మంది?

జిల్లా విద్యాశాఖాధికారి: చిత్తూరు జిల్లాలో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 2,74,088 మంది వీరిలో మూడో విడతలో అమ్మఒడికి 1,49,090 మంది అర్హత పొందారు. వీరి తల్లుల ఖాతాల్లో అమ్మఒడి జమ చేయడం జరిగింది.

ప్రజాశక్తి : మోడల్ స్కూల్స్ ఎలా నడుస్తున్నాయి?

జిల్లా విద్యాశాఖాధికారి: జిల్లాలో ఏడు ఆదర్శ పాఠశాలలు నడుస్తున్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 4,736 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఇందులో ఐదు బాలికల వసతి గృహాలో 500మంది బాలికలు వసతి పొందుతూ విద్యను అభ్యసిస్తున్నారు.

ప్రజాశక్తి: ఎంతమంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు?

జిల్లా విద్యాశాఖాధికారి: జిల్లాలోని ప్రాథమి, ప్రాథమికోన్నత, ఉన్న పాఠశాలల్లో 1,74,524 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం లబ్దిపొందుతున్నారు. వీరికి ప్రభుత్వ మెనూ ప్రకారం వారానికి ఐదు కోడిగుడ్లు, మూడు చిక్కీలతో కూడిన భోజనం అందించడం జరుగుతోంది. భోజనం అందించేందుకు 4,603 స్వయం సహాయక సంఘాల మహిళలు భోజనం తయారు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

ప్రజాశక్తి: ప్రభుత్వ పాఠశాలల్లో మరగుదొడ్ల పరిస్థితి ఏమిటి?

జిల్లా విద్యాశాఖాధికారి: ప్రభుత్వ పాఠశాలల్లో మరగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేలా ఆయాలను నియమించడం జరిగింది. ఈ మేరకు 2,525 మంది ఆయాలు పనిచేస్తున్నారు. వీరిని నెలకు రూ.6వేలు చొప్పున గౌరవవేతనం అందిస్తున్నాం.

ప్రజాశక్తి: ప్రభుత్వబడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆశిస్తున్నారా?

జిల్లా విద్యాశాఖాధికారి: ప్రభుత్వబడుల్లో కల్పించిన సౌకర్యాల దృష్ట్యా ప్రభుత్వ బడుల్లో తమ పిల్లన్ని చేర్చేందకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఈ విద్యాసంవత్సరం ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వబడుల్లో విద్యార్థులు అడ్మిషన్లు ప్రారంభించాం. తమ పిల్లన్ని చేర్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది.

దురాక్రమణలో పాలారు నది

- కుచించుకుపోతున్న పరివాహక ప్రాంతం



ప్రజాశక్తి- శాంతిపురం: మండల కేంద్రంలోని పాలారు నది భూఆక్రమణదారుల చేతిలో దురాక్రమణకు గురవుతోంది. పాలారు నది పరివాహక ప్రాంతానికి ఇరువైపులా ఉన్న భూమిని కొంతమంది రైతులు ఆక్రమించుకోవడంతో నీరు ప్రవహించే ప్రాంతం రోజురోజుకు కుచించుకుపోతుంది. ఇటీవల ఓ వ్యక్తి పాలారు బ్రిడ్జి పక్కన ఉన్న చెక్‌డాం వద్ద తన స్థలంలో ఒక షెడ్డును ఏర్పాటు చేసుకొని పాలారు నదిలోకి మట్టిని తోలి రీవిట్మెంట్ కట్టి ఆక్రమించుకున్నాడు. అంతేకాకుండా పాత ఆర్ అండ్ బి రోడ్డును కూడా తన స్థలంలోకి కలుపుకున్నాడు. మరోవైపు కొంతమంది పాత ఆర్ అండ్ బి రోడ్డును ఆక్రమించుకొని ఏకంగా భవనాలే నిర్మించేశారు. దీంతో నీరు పాలారి నదిలోకి ప్రవేశించడానికి దారి పూర్తిగా మూసుకుపోయింది. ఆర్ అండ్ బి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాలారు నది ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తోతాపూరి టన్ను రూ.30 వేలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు, తోతాపురి రకం మామిడి కాయలకు టన్నుకు రూ.30,000లకు తగ్గకుండా మామిడి రైతులకు చెల్లించాలని టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరు జిల్లాలో దాదాపు 58వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉందని, మామిడి దిగుబడులు ఈ సంవత్సరం గణనీయంగా తగ్గిపోయాయని అన్నారు. సాధారణంగా ఎకరా విస్తీర్ణంలో లభించే 4–6 టన్నుల దిగుబడి స్థానంలో ఈ సంవత్సరం ఎకరాకు రెండు టన్నులు కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. దిగుబడులు తగ్గడం వల్ల ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారని, అయితే గత నాలుగైదు రోజులుగా మామిడి ధరలు పతనం కావడంపై జిల్లా కలెక్టర్ ఉద్యానవన మార్కెటింగ్ శాఖలతో సమీక్షించారు. తోతాపురి మామిడికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ఉద్యాన, వ్యవసాయ మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో తోతాపురి మామిడి రకం దిగుబడి తక్కువగా ఉన్నప్పటికీ ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు, మామిడి ర్యాంపు యజమానులు కూడా టన్నుకు రూ.30వేలకు తగ్గకుండా ధరలు చెల్లించేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. తక్కువ ధరలు చెల్లించిన మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు, ర్యాంపు యజమానులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.





చంద్రబాబు విజన్‌తో తిరుమల అభివృద్ధి

- టిటిడి ఈవో శ్యామలరావు బాధ్యతలు స్వీకరణ - పారిశుధ్య నిర్వహణ బాగోలేదని ఆగ్రహం

ప్రజాశక్తి - తిరుమల

హిందువులందరికీ తిరుమల పవిత్రమైన దేవాలయమని, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానానికి ఈవోగా రావడం తన అదృష్టమని, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో తిరుమలను అభివృద్ధి చేస్తానని నూతన ఈవో జె.శ్యామలరావు అన్నారు. టిటిడి కార్యనిర్వహణాధికారిగా ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి నుంచి బాధ్యతలను స్వీకరించారు. సతీమణితో కలిసి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆ తర్వాత జెఇఒ వీరబ్రహ్మం ఈవోకు శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా శ్రీ వరాహ స్వామివారిని ఈవో దర్శించుకున్నారు. ఆ తర్వాత వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. జెఇఒ గౌతమి, సివిఎస్ఓ నరసింహకిషోర్, ఎస్వీబీసీ సిఇఒ షణ్ముఖ్ కుమార్, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

దర్శన క్యూలైన్లు పరిశీలన

దర్శన క్యూలైన్లను నూతన ఈవో శ్యామలరావు పరిశీలించారు. క్యూలైన్ల వద్ద పారిశుధ్యం నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతలు చేపట్టినరోజే క్షేత్రస్థాయి పరిశీలన చేయడం గమనార్హం. భక్తులకు అందించే తాగునీటిని పరిశీలించి ల్యాబ్‌కు పంపించాలని ఆదేశించారు. ఇద్దరు పారిశుధ్య అధికారులకు మెమోలు జారీ చేశారు. టిటిడి ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

జర్నలిస్టు సమాజానికి రుణపడి ఉంటా: ఎంఎల్‌ఎ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

జర్నలిస్టుగా సమాజంలో ప్రజా సమస్యలను అధ్యయనం చేసిన తనకు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించిన సీఎం నారా చంద్రబాబునాయుడుకు, పూతలపట్టు నియోజకవర్గ ప్రజలకు, జర్నలిస్టులకు ఎప్పటికీ రుణపడి ఉంటానని సీనియర్ జర్నలిస్ట్, పూతలపట్టు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మురళీమోహన్ కు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ 22 ఏళ్లుగా జర్నలిస్టుగానే ఉంటూ తనకున్న చిరకాల వాంఛ శాసనసభ్యుడి కలను నేటికి నెరవేర్చుకోగలిగానన్నారు. తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు తనకు సుపరిచితులని, ఎన్నో ఏళ్లుగా తిరుపతి ప్రెస్ క్లబ్ కు సొంత భవన నిర్మాణానికి స్థల కేటాయింపుకు, జర్నలిస్టులకు హౌస్ సైట్లను ప్రభుత్వం కేటాయింపజేసేలా కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బాలచంద్ర, కోశాధికారి శ్రీకాంత్, ప్రజాశక్తి సిబ్బంది శ్రీనివాసులు, సురేష్, విలేఖరి గౌస్ బాషా ప్రత్యేకంగా అభినందించారు.

ప్రశాంతంగా యుపిఎస్‌సి సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

ఉదయం 49.44శాతం, మధ్యాహ్నం 49.31శాతం హాజరు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆదివారం జరిగిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ– 2024 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆదివారము ఉదయం 9:30 నుండి 11:30వరకూ, మధ్యాహ్నం 2:30 నుండి 4:30 గంటల వరకు రెండు సెషన్ల లో పరీక్ష నిర్వహణ జరిగిందనీ, తిరుపతిలో నిర్వహించిన 11 పరీక్షా కేంద్రాల లో యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలకు 5518 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఉదయం 2728 మంది 49.44 శాతంగా, మధ్యాహ్నం 2721 మంది 49.31 శాతంగా హాజరయ్యారని తెలిపారు. పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుండి బందోబస్తు నడుమ సంబంధిత పరీక్ష కేంద్రాలకు తరలించామన్నారు.

7న కళామందిర్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని సాయి గార్డెన్ సిటీలో స్థాపితమైన కళామందిర్‌లో జూలై 7న ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు తులసినాథంనాయుడు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు భాషా పరిరక్షణ, తెలుగు సాహిత్యం, తెలుగు భాషకు కృషి చేస్తున్న వ్యక్తులకు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందించనున్నట్లు వివరించారు. ఈనెల 30వ తేదీ లోపు వారు పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రేపు గంగ జాతర

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో మంగళవారం గంగమ్మ జాతర కార్యక్రమం జరగనుంది. ఉదయం ఆంబల్లు, సాయంత్రం పొంగళ్లు పెట్టి రాత్రికి గంగమ్మ శిరస్సు ఊరేగింపు, బుధవారం గంగమ్మ దర్శనాన్ని కల్పిస్తున్నట్టు గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం


వివాహ వేడుకల్లో పూతలపట్టు ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: యదమరి మండలం ఒటేరుపల్లె పంచాయతీ సర్పంచ్, జిల్లా తెలుగు మహిళా అధికార ప్రతినిధి పత్తిపాటి భగవతి, రాజేంద్ర నాయుడు దంపతుల కుమార్తె పిఆర్ రినాశ్రీ వివాహానికి పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్ హాజరయ్యారు. ఆదివారం శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో జరిగిన ఈ వివాహ వేడుకలో ఎమ్మెల్యే వధూవరులను ఆశీర్వదించారు.

ఎమ్మెల్యేని కలిసిన మాజీ ఎంపీటీసీ

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: బంగారుపాళ్యం మండలం కీరమంద మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు ఆదివారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడంపై ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అమరనాథ్‌రెడ్డిని దుశ్శాలువలతో సత్కరించారు. ఆయన వెంట నాయకులు బాబు తదితరులు ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ కళ్యాణం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నారాయణ కళ్యాణం వేడుకలు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి భూదేవి సమేత నారాయణలకు పట్టు వస్త్రాలు పూల హారతులతో అలంకరణ చేసి అర్చకులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ కళ్యాణోత్సవం వైభవం జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ పూజలకు చిత్తూరులోని సంతపేటకు చెందిన నాగేంద్ర దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్ల వెంకటేష్ రెడ్డి, అర్చకులు విష్ణు స్వామి, గోవిందస్వామి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. కుప్పం పీఈఎస్ ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేపట్టారు. శిబిరంలో 130మందికి పరీక్షలు నిర్వహించగా 37మందిని రెఫరల్స్ పంపారు. 16మందికి గర్భ సంభధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 5మంది ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి సమస్యలు ఒకరికి, గర్భ సంబంధిత వ్యాధి ఒకరికి పరీక్షలు చేశారు. మిగిలిన 14మంది ఎముకల పరీక్షలు చేశారు. ఆపరేషన్లకు ఎంపిక అయిన వారిని ఈ నెల 18వ తేది మంగళవారం ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేపడతామని మహతి ఫౌండేషన్ సిబ్బంది మునెప్ప, శ్రీనివాసులు పేర్కొన్నారు.

చెత్తా చెదారం.. దుర్వాసన


ఆరోగ్య కేంద్రం వద్ద పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి-పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు కుళ్ళిన చెత్తాచెదారం పేరుకుపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చి పోవు ప్రజలు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మార్గంలో నాలుగు గ్రామాలకు వెళ్లే ప్రజలు రోడ్డుపై కూలిన చెత్త దుర్వాసనతో ముక్కులు మూసుకుని పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరోగ్య కేంద్రం పక్కనే ఉన్న కాలనీవాసులు చెత్తాచెదారాన్ని ఆసుపత్రి ముందు పడేయడంతో ఈ దుస్థితి నెలకొంది. పంచాయతీ సిబ్బంది రోజులు తరబడి ఉన్న చెత్తను శుభ్రం చేయడం లేదని ఈ మార్గంలో వచ్చి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని చెత్తను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

దివ్యాంగుల కుటుంబాలకు మేకలు పంపిణీ



మేకలు పంపిణీ చేస్తున్న సుచి సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: యాదమరి మండలంలోని జోడి చింతల సుచి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల కుటుంబాలకు మేకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ పాల్ విజయ్ కుమార్, గ్లోరీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు ఆదాయం ఉత్పత్తి పెంచడానికి, పనికి ఆహార పథకం కూలి పని చేవారికి పనిముట్లు, ప్రజలు ఆరోగ్యంగా జీవించడానికి గత 40సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపిఎం కల్పలత, సీసీ బాలకృష్ణ పాల్గొని దివంగుల కుటుంబాలకు ఆర్థిక అభివృద్ధి పెంపొందించడానికి 20మందికి మేకలు పంపిణీ చేయడం పట్ల సంస్థను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది జాకబ్, జాన్సన్, చిన్నయ్య, సాదు భాయ్, యోహాన్ దివ్యాంగులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బైక్ రేసింగ్



ప్రజాశక్తి- వీకోట: మండల కేంద్రమైన వీకోటలో ఆదివారం మోటోక్సైట్, పలు ఆర్గనైజేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ రేసింగ్ స్థానిక ప్రజలను విశేషంగా అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు రంగనాథ్‌లు హాజరై జెండా ఊపి బైక్ రేసింగ్‌ను ప్రారంభించారు. జయరాజ్ పధ్వీ, భాస్కర్, మిలన్ ఆంటోనీ వారి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈపోటీలలో భారతదేశ నలుమూలల నుంచి యువత పాల్గొన్నారు. ఆర్గనైజేషన్ జయరాజ్ పధ్వీ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా వీకోట మండల కేంద్రంలో బైక్ రేసింగ్ కార్యక్రమం నిర్వహించడానికి సహకరించిన ప్రతిఒక్కరికి కతజ్ఞతలు తెలియజేశారు. పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కార్ల రేసింగ్ కూడా పెట్టబోతామని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించాలని దానికి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం అవసరమన్నారు. ఈ బైక్ రేసింగ్‌లో దాదాపు 40 మంది పాల్గొన్నారు. వీరిలో విజేతలకు మొదటి బహుమతి రూ.2లక్షలు, రెండో బహుమతి లక్ష రూపాయలు, మూడో బహుమతి రూ.50వేల వరకు అందజేశారు. దీనితోపాటు ప్రముఖ కంపెనీలకు సంబంధించిన సైకిల్స్‌ను విజేతలకు బహుమతిలుగా పంపిణీ చేశారు.

'పెర్టీ9 పెర్టిలిటీ సెంటర్'ను విస్తరింపజేస్తాం: డాక్టరు సునీత సాధు



ప్రజాశక్తి-తిరుపతి సిటి: దేశంలో మూడో అతి పెద్ద, దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ ఐవిఎఫ్ చైన్‌లలో ఒకటైన పెర్టీ9 పెర్టిలిటీ సెంటర్, తిరుపతి కేంద్రంలో తమ కార్యకలాపాలు మరింత విస్తరింపజేస్తామని తిరుపతి కేంద్రం కన్సల్టెంట్ డాక్టరు సునీత సాధు తెలిపారు. తిరుపతిలో పెర్టి9 పెర్టిలిటీ సెంటర్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులుగా మారాలనే కలను నెరవేర్చు కోవడానికి తమ సెంటర్‌ను సంప్రదించ చాలన్నారు. భవిష్యత్ పెర్టిలిటీ ట్రీట్‌మెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. రోగి కేంద్రీకృత సంరక్షణకు ప్రాధానత్య ఇస్తుఉన్నామన్నారు. మరో కన్సల్టెంట్ డాక్టరు దీప్తి దామోదర మాట్లాడుతూ తిరుపతిలో పెర్టీ9పెర్టిలిటీ సెంటర్‌లో సాంకేతికత, రోగి అనుభవం రెండింటిపరంగా శ్రేష్టతకు ప్రాదాన్యత ఇస్తున్నామన్నారు.

ప్రతిపక్షాలపై దాడులు మంచిది కాదు : సిపిఐ

ప్రజాశక్తి-తిరుపతి సిటి


రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పార్టీలు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేల పైన అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు దాడులు చేయడం మంచిది కాదని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన,

బిజెపి సంయుక్తంగా ఏర్పాటైన ఎన్డీఏ కూటమి ద్వారా 164 సీట్లు గెలుచుకొని అధికారం చేపట్టి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. అయితే వైఎస్ఆర్ పార్టీ ఎమ్మెల్యేలను, గెలవని ఎమ్మెల్యేల పైన అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు దాడులు చేయడం, దాడులు చేస్తామని బెదిరింపు చర్యలకు పాల్పడడం మంచి పద్ధతి కాదన్నారు.

తాజాగా పుంగనూరు ఎంఎల్ఎ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బెదిరింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. ప్రతిపక్ష పార్టీలను గౌరవించాలన్నారు.వైఎస్ఆర్ పార్టీ అలా చేయడం వల్లనే 11 సీట్లకే పరిమితమయ్యిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా

> గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్


ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-కార్వేటినగరం, వెదురుకుప్పం: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తానని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. ఆదివారం ఆయన కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో పర్యటించారు. ముందుగా ఆయనకు టీడీపీ, జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమై అత్యధిక మెజారిటీతో గెలుపొందడంపై ఆనందాన్ని పంచుకున్నారు. జనసేన నేత పొన్న యుగంధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. విజయం తరువాత ఎమ్మెల్యే తొలిసారి పర్యటనకు రావడంతో ఆయన్ను కలిసేందుకు కార్యకర్తలు ఉత్సాహపడ్డారు. ఈ సందర్భంగా శ్రేణులనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. నిత్యం నియోజకవర్గంలో ప్రజలను అందుబాటులో ఉండి వారి సమస్యలను తీరుస్తానని స్పష్టం చేశారు. ప్రజలు తమపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించినందుకు కృతజ్ఞతా భావంతో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బీసీలపై అగ్రవర్ణాల దాడి దారుణం

> బాధితులకు తగిన న్యాయం చేయాలి

> రాష్ట్ర గౌడ సంఘం కార్యదర్శి బుస నాగరాజ్ గౌడ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజగౌడ్

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: యాదమరి మండలం మోటాంగ్లపల్లెలో బీసీలపై అగ్రవర్ణాలు దాడి చేయడం హేయమైన చర్య అని రాష్ట్ర గౌడ సంఘం కార్యదర్శి నాగరాజు గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన బంగారుపాళ్యంలో విలేకరులతో మట్లాడారు. యాదమరి మండలం మోటాండ్లపల్లిలో రెడ్డి సమాజికవర్గానికి చెందిన లోకనాథ్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, జీవరత్నంరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డిలు అదే గ్రామంలోని గుట్ట పొరంబోకు స్థలాన్ని ఆక్రమించుకుని డీకేటీ పట్టా తెచ్చుకున్నట్లు ఆయన వివరించారు. అయితే ఆ స్థలంలో తరతరాలుగా గ్రామస్తులు కాటమరాజు గుడిని నిర్మించుకొని పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో శనివారం గ్రామస్తులు పూజలు చేయడానికి వెళ్లిన సందర్భంగా ఈడిగగౌడ సంఘీయులపై వారు దాడికి పాల్పడినట్లు చెప్పారు. పతకం ప్రకారం కత్తులు, కారంపొడి, రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేశారని మండిపడ్డారు. దీంతో గ్రామస్తులకు రక్తగాయాలైనట్లు పేర్కొన్నారు. దౌర్జన్యంగా బరితెగించి బీసీలపై అగ్రవర్ణాలు దాడులకు పాల్పడడం దారుణమన్నారు. దాడిచేసిన వారిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి కఠిన చర్యలు చేపట్టాలన్నారు. వివిదానికి కారణమైన డీకేటి పట్టాను రద్దు చేసి ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బాధింపపడ్డవారికి తగు న్యాయం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో చిత్తూరు జిల్లా ఈడిగ గౌడ సంఘం ఉపాధ్యక్షులు జనార్ధన్ గౌడ్, జిల్లా గౌడ యువసేన ప్రధాన కార్యదర్శి లేబాకుల మురళి గౌడ్, మండల గౌడ్ సంఘం నాయకులు మాధవరావు గౌడ్, బాబుగౌడ్, ప్రభాకర్ రావు గౌడ్, వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

త్యాగాల పండుగ బక్రీద్



ముస్లిం సోదరులకు శుభాకంక్షలు తెలిపిన ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: త్యాగాల పండగ బక్రీద్ అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ఆదివారం ఆయన ముస్లిం మైనారిటీ సోదరులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులు జరుపుకునే అతి ముఖ్యమైన పండుగల్లో ఒకటి (ఈద్–అల్–అదా) బక్రీద్ అన్నారు. ఇది ఇస్లాం మతంలో జరుపుకునే రెండవ అతిపెద్ద పండుగ అని ఆయన చెప్పారు. త్యాగాల ప్రతీకగా చెప్పే బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకోవాలని కోరారు. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు కొంత పంచిపెట్టడాన్ని మించిన దాతత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ పండుగ కలిగిస్తుందన్నారు.



వారం రోజుల పాటు నిర్విరామంగా...

సప్తగిరి సంగీత సప్తాహం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సప్తగిరి సంగీత సప్తాహం పేరుతో 24 గంటలు నిరంతరాయంగా వారం రోజులపాటు తలపెట్టిన కార్యక్రమం ఆదివారం సంగీత కచేరిలతో ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఉదయం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమై.. తిరుపతి కి చెందిన సంగీత విద్వాంసులు .. ప్రపంచ ప్రఖ్యాత వయోలిన్ గాత్ర విద్వాంసులు సంగీత గ్రంథకర్త ఎస్వి సంగీత కళాశాల విశాంత ప్రిన్సిపాల్ కొమాండూరు శేషాద్రి సంగీత కచేరి, అనంతరం ప్రపంచ ప్రఖ్యాత డోలు విధ్వాంసులు ఎస్వి నాదస్వర పాఠశాల అధ్యాపకులు వైయల్ శ్రీనివాసులు , వైఎల్ హరిబాబు బందం చే మంగళ ధ్వని నిర్వహించారు. డాక్టర్ కొల్లూరు వందన గాత్రం చేయగా, ఆముదాలవలసకు చెందిన డాక్టర్ మావుడురి సత్యనారాయణ శర్మ చే వయోలిన్, కోటిపల్లి రమేష్ మదంగం హనుమంతరావు చే ఘట్టం .. అదేవిధంగా చిన్నమ్మ దేవి చే గాత్రం.. ధీరజ్ చే వయోలిన్.. ధర్మారావుచే మదంగం , రామకష్ణచే ఘట్టం.. ఇలా అనేక బందాలచే గాత్ర కచేరీలు ఘనంగా అందరినీ ఆకట్టుకున్నాయి. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్విరామంగా సాగనుంది.

టీడీపీ కార్యాలయంలో సందడి

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి శనివారం రాత్రి పలమనేరు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే పార్టీ కార్యాలయం వద్ద అభిమానులు ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపేందుకు ఉత్సాహం చూపించారు. ఆయనకు శాలువలు కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాభినందనలు తెలిపారు.

'నేను బడికి పోతా' పై ఎన్రోల్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి-పలమనేరు: "నేను బడికి పోతా" కార్యక్రమంపై ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు లీలావతి, బాలసుందరంలు తెలిపారు. ఆదివారం పలమనేరు లో విధివిధానలపై అధికారులతో వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా ఎంఈవో లీలావతి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈనెల 13 నుంచి జూలై 12వరకు నిర్వహించడం జరుగుతుంద న్నారు. 6 నుంచి 14సంవత్సరం లోపల వయస్సు ఉన్న పిల్లలను వంద శాతం ఎన్రోల్మెంట్ చేయాలన్నారు. దీనితో పాటు బడికి నిలిచిపోయిన వారిని తిరిగి బడిలో చేర్పించాలని, దీని కోసం జిల్లా, మండల, పాఠశాల స్థాయిలో కమిటీలు ఏర్పరచుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నట్లు స్పష్టం చేశారు. ఎంఈవో బాలసుందరం మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు ఉండి బడిలో చేరిన వాళ్ళ, నెవర్ ఎన్రోల్మెంట్ ఉన్నవారిని వాలంటీర్ వెల్ఫేర్ అసిస్టెంట్ సహాయం తీసుకొని సీఆర్పీలు ప్రతిరోజు 12నుంచి ఒక గంట లోపల ఎంఈఓ ఆఫీస్‌కి డేటా పంపాలని ఆదేశించారు.

అన్నదానం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్ గెలుపొందడంపై ఆదివారం టీడీపీ నేత రాజేంద్రన్ మండలంలోని కోటగరం చర్చిలో అన్నదానం చేపట్టారు. అంతకు ముందు ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామినాథన్, బాబుప్రసాద్, సామివేల్, జ్యోతి, నందిని, పూర్ణ, విజయకుమారి పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర


అమ్మవారి సేవలో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని చప్పిడి పల్లిలో అనాధిగా పెద్దపులి గంగమ్మ జాతర వైభవంగా జరుగుతుంది. శనివారం రాత్రి గ్రామ పురవీధులలో గంగమ్మ శిరస్సు మెరువని చేపట్టారు. అనంతరం ఆదివారం ఉదయం గ్రామం మధ్యలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కేశవులు, ఎంపీటీసీ సుజాత మోహన్, సర్పంచ్ విజయ ప్రకాష్‌లు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ కాల్పులు విరమించాలి


ప్రజాశక్తి -రేణిగుంట: పాలస్తీనా పౌరులపై ఇజ్రాయిల్ సైన్యం జరుపుతున్న కాల్పులను విరమించాలని సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ అన్నారు. రేణిగుంట ఫ్లై ఓవర్‌కింద 'రాజ్యాంగ పరిరక్షణ వేదిక' ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సదస్సు ఆదివారం జరిగింది. రాఘవశర్మ మాట్లాడుతూ పాలస్తీనాపై జరుగుతున్న యుద్ధంపై మానవాళి కలత చెందుతోందన్నారు. అమానవీయ మారణహోమాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. 20 లక్షల మంది పాలస్తీనా ప్రజలు సొంత గడ్డపై శరణార్థులుగా మారిపోవడం చూస్తుంటే ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టే పరిస్థితన్నారు. ఇజ్రాయిల్‌కు వెంటనే ఆయుధ సరఫరా ఆపి, సైనిక సంబంధాలను రద్దు చేసుకోవాలన్నారు. ఆవాజ్ నాయకులు దిలీప్‌బాషా ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఇజ్రాయిల్ దాడిలో మరణించిన పాలస్తీనావాసులకు సంతాపం తెలిపారు. పాలస్తీనాను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించాలన్న తీర్మానాన్ని ఏకగ్రీవంగా సభ ఆమోదించింది. సత్యశ్రీ,, అమీర్ భాషా, హరినాథ్, రమణ తదితరులు ప్రసంగించారు.

సేంద్రీయ సంత... ఆరోగ్యం అంతా..!

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

కరోనా తరువాత కొంతమంది ఆరోగ్యం పట్ల పూర్తిస్థాయిలో జాగ్రత్తలు పాటిస్తున్నారు. మరికొంతమంది సంపాదన మోజులో ఫాస్ట్‌ఫుడ్ కల్చర్‌కు చేరువయ్యారు. అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఎలాగైనా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకునే వారి కోసం 'కనెక్ట్ ది ఫార్మర్స్' అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినెలా ఆర్గానిక్ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తోంది. నాబార్డు సహకారంతో మహతి కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆర్గానిక్ మేళా శనివారంతో ముగిసింది. ఆహార ఉత్పత్తులు, దినుసులు, వనమూలికలు ఉత్పత్తులు, కాయగూరలు, ఆకుకూరలు ఇలా దాదాపుగా 100కి పైగా మేళాలో వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. 50ఏళ్ల క్రితం 'మచ్చకంది' అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఐదారుమంది రైతులు మాత్రమే దీన్ని పండిస్తున్నారు. ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది.

600 రకాల ఒడ్లున్నాయి : అనకలి హరిక్రిష్ణ(రైతు), పెసవాయి గ్రామం, గడివేముల(మం), నంద్యాల జిల్లా



మన పూర్వీకులు సేంద్రీయ వ్యవసాయ పంటలను పండించి వాటినే తిని ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. కాలానుగుణంగా భూమి సారవంతం కోల్పోయి సత్తవ లేని ఆహార పదార్థాలు పండుతున్నాయి. వాటిని తిని మన ఆరోగ్యాన్ని క్షిణింపజేసుకుంటున్నాం. గతంలో 600 రకాల ఒడ్లున్నాయి. వాటిలో అందుబాటులో ఉన్నవి కొన్ని మాత్రమే. ఎక్కువ భాగం పాలిష్ పట్టడం వలన విటమిన్లను మనం కోల్పోతాము. ఈ ప్రదర్శన ద్వారా మంచివి, మరుగున పడిపోతున్న సేంద్రీయ ఉత్పత్తులను ప్రజలకు వివరించి అమ్మకాలు సాగిస్తున్నాం. దేశవాలీ విత్తనంతో సుగంధ పసుపు నాణ్యమైనది.

మనిషి సహజ సౌందర్యానికి : ఎం.శేషసాయి, లక్ష్మి గోమయ ప్రాడక్ట్స్, గుంటూరు జిల్లా

నిత్య జీవితంలో మనిషి తన సౌందర్యాన్ని సహజంగా కాపాడుకోవడానికి అవసరమైన వినియోగాలను వనమూలికల ద్వారా ఉత్పత్తి చేసి ఆయా ఉత్పత్తులను మేళాల ద్వారా ప్రజలకు వివరించి అమ్మకాలను సాగిస్తున్నాం. భావన అల్లం, భావన జీలకర్ర, భావన ఉసిరి, గో ఆధారిత పళ్లపొడి, దశదినుసులు ఇలా చాలా వనమూలికల ఉత్పత్తులను అందుబాటులో ఉంచాము. గ్యాస్టిక్ ట్రబుల్, ఎర్రచందనం సోపులు, జుట్టు పెరగడానికి తైలం ఈ మేళాలో సందర్శకులకు వివరించి అమ్మకాలు చేస్తున్నాం.



50 ఏళ్ళకే అనారోగ్యపాలవుతున్నారు : మురుగానందమ్, రైతు, సేలం జిల్లా, తమిళనాడు

నేడు ఆహార పంటలు రసాయన పద్ధతుల్లో పండించడం మూలాన 50 ఏళ్ళకే అన్నారోగ్యపాలవుతున్నారు. దేశవాలీలో 70 రకాల విత్తనాలకు తిరిగి ఆర్గానిక్ మేళాల ద్వారా ప్రాచుర్యం కల్పిస్తున్నాం. నేను సివిల్ ఇంజినీరింగ్ చదివాను. కాని మనిషి చిన్నతనంలో వస్తున్న ఆరోగ్య సమస్యలకు మూలం జీవం లేని ఆహార పదార్ధాలను తింటున్నారని గ్రహించి ప్రజలకు నాణ్యమైన మన పూర్వ పద్ధతులను అనుసరించి పండించే సేంద్రీయ ఉత్పత్తులను అందించాలనే సంకల్పంతో ఇటువంటి ఆర్గానిక్ మేళాలకు వచ్చి దేశవాలీ విత్తనాలను తక్కువ ధరలకే అమ్ముతున్నాను. ఎలిఫెంట్ ట్రంక్ ఒక్రల్ బెండ దాదాపుగా ఒకటిన్నర అడుగు పెరుగుతుంది. అలానే వింగుడ్ బీన్స్ 5 నెలలకు కాపు వస్తుంది. వీటివల్ల చక్కటి ఆరోగ్యం పొందవచ్చు అని నేటి తరానికి తెలపాలన్నదే నా లక్ష్యం.





'కనెక్ట్ ది ఫార్మర్స్'చే ప్రతిమాసం 'ఆర్గానిక్' మేళా

సేంద్రీయ ఉత్పత్తులను వినియోగించాలి

సునీల్, డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్, నాబార్డ్, చిత్తూరు జిల్లా



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి నాణ్యమైన ఆహారాన్ని తిని ఆరోగ్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో కనెక్ట్ ది ఫార్మర్ వారు చక్కటి మేళాలను నిర్వహిస్తున్నారు. ప్రకృతిలో సహజ వనరులను వినియోగించి వచ్చే ఆహార పంటలను ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలనే ప్రయత్నం అభినందనీయం. మేము సేంద్రీయ ఉత్పత్తులు పెరిగేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూనే మేళాలను నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తాం.